


## 102 వ భాగం

# కృష్ణావతార వైభవం

కృష్ణుడు చేసిన పనులింకా ఉన్నాయి కనక మరిన్ని చెప్తున్నాడిపుడు. ఈ కధల్లో మాయ, అహంకారం అనేవి ఎటువంటివారినైనా ఎలా లొంగదీసుకుంటాయో అనేది స్పష్టంగా కనిపిస్తుంది, గమనించండి.

క. దివిజేంద్రప్రీతిగ వ
ల్లవజను లేఁటేఁటఁ జేయు లాలిత సవనో
త్సవము హరి మానిపిన గో
పవరులు గావింపకున్న బలరిపుఁ డలుకన్ [2-183]

ఏటేటా గోపాలురు (వల్లవ జనులు) దేవేంద్రుడికి (దివిజేంద్రుడు, బలరిపుడు = రాక్షసులకి శత్రువు) చేసే ఉత్సవం మానిపించాడు కృష్ణుడు. దాంతో ఇంద్రుడికి కోపం వచ్చింది. అదేమిటి, కృష్ణుడు పుట్టే ముందే భూదేవితో పాటు ఇంద్రుడూ బ్రహ్మ కూడా వెళ్ళి 'మీరు మరో జన్మ ఎత్తి ఇలా అందర్నీ కాపాడాలి' అంటే భగవంతుడు సరే అని కృష్ణుడిగా పుట్టాడు కదా? అటువంటి బ్రహ్మ, ఇంద్రుడు కూడా కోపం తెచ్చుకోవడం ఏవిటి? అదే మాయ అంటే. భగవంతుడు పుట్టాడు సరే, కానీ ఎక్కడ పుట్టాడు, ఏం చేస్తున్నాడనేది ఆయనకి తప్ప ఎవరికీ తెలియదు. తెల్సినా గుర్తించలేం. ఇలా గుర్తించక పోవడానికేమిటి కారణం? అహంకారం. నేను ఇంద్రుణ్ణి, నేను చంద్రుణ్ణి, నేను ఇదీ, నేను ఇంతా అంతా అనే విషయం. ఇంతా చేసి ఏమిటి అహంకారానిక్కారణం? "నేను" అనేది మాత్రమే. ఈ మాయకి ఎవరూ అతీతులు కారు.

తే. మంద గొందల మంద నమందవృష్టిఁ
గ్రందుకొనుఁ డంచు నింద్రుండు మందలింపఁ
జండపవన సముద్ధూత చటుల విలయ
సమయ సంవర్త కాభీల జలధరములు [2-184]

గోవుల మందలన్నీ భయపడేట్టూ ఎడతెరిపి లేకుండా వాన కురిసేటట్టు (అమంద వృష్టి) చేయండి అనేసరికి విలయకాలంలో వచ్చినట్టూ మేఘాలన్నీ (జలధరములు – జలానికి ఆధారమైనవి) బయల్దేరాయి.

శా. సప్తస్కంధ శిఖా కలాప రుచిమత్సౌదామనీవల్లికా
దీప్తోదగ్రముహుస్తమః పిహితధాత్రీ భాగనీరంధ్రమై
సప్తాశ్వస్ఫుర దిందు మండల నభస్సంఛాదితాశాంతర
వ్యాప్తాంభోద నిరర్గళస్ఫుట శిలావాః పూరధారాళమై [2-185]

ఈ మేఘాలవల్ల కురిసే వాన ఎలా ఉందంటే – ఏడు నాలికల (సప్త స్కంధ) తో వచ్చే అగ్ని (శిఖ) సమూహంతో (కలాప) మెరుపుల (సౌదామిని) తీగలతో (వల్లికా); ఈ మెరుపు తీగలు ఎక్కడినుంచి అంటే, భూమి కప్పివేసిన ఉగ్రమైన చీకటి (స్తమ; తమస్సు అంటే చీకటి కదా) వంటి మేఘాలవల్ల; ఈ మేఘాలు సూర్య (సప్తాశ్వస్ఫుర – ఏడు గుర్రాలతో వెలుగొందేది) చంద్ర (ఇందు) మండలాలని కప్పివేసాయి. ఇలా వ్యాపించిన మేఘాలలోంచి రాళ్లతో (శిలావా) వాన కురవడం ప్రారంభమైంది. ఎప్పుడైనా భీకర రసంతో పద్యం రాయాలంటే పోతన ఎంచుకునేది శార్దూలం. ఒకసారి వెనక్కి వెళ్ళి ప్రయత్నం చేయండి. నాలుక తడబడకుండా తప్పు రాకుండా పద్యం ఓ సారి చదవగలమా?

వ. కురియు వానజల్లు పెల్లున రిమ్మలుగొని సొమ్మలు వోయి గోకులం బాకులంబయి "కృష్ణ! కృష్ణ! రక్షింపు" మని యార్తింబొంది కుయ్యిడ నయ్యఖండ కరుణారస సముద్రుండును భక్తజన సురద్రుముండును నైన పుండరీకాక్షుండు.
[2-186]

శా. సప్తాబ్దంబుల బాలుఁడై నిజభుజాస్తంభంబునన్ లీలమై
సప్తాహంబులు శైలరాజము లసచ్ఛత్రంబుగాఁ దాల్చి, సం

గుప్తప్రాణులఁ జేసె మాధవుఁడు గోగోపాలకవ్రాతమున్
సప్తాంభోధి పరీతభూధరున కాశ్చర్యంబె చింతింపఁగన్. [2-187]

ఇటువంటి వాన కురుస్తున్నప్పుడు ఎవరు రక్షించగలిగేది? కరుణారస సముద్రుడు, భక్తులకి కల్ప వృక్షం అయినటువంటివాడు (సుర ద్రుముడు దేవుళ్ళ చెట్టు, కల్పవృక్షం) – గోపాల సింహంబు అని చెప్పుకున్నాం కనక ఆ శార్దూలంలో పలికించిన దారుణమైన వానలోంచి గోపాలురనందర్నీ రక్షించడాన్ని కిందటి శార్దూలాన్ని మించిన మరో శార్దూలంలో చెప్తున్నాడు పోతన.

ఏడేళ్ల బాలుడైన కృష్ణుడు (సప్తాబ్దంబుల బాలుఁడై) తన భుజాల మీద ఏడు రాత్రులు (సప్తాహంబులు) ఆ గోవర్ధన గిరిని (శైలరాజము) గొడుగులాగా (ఛత్రంబుగా దాల్చి) ఎత్తి పట్టుకుని చుట్టూ నీటి సముద్రమైన చోట గోపాలగణాలని, గోవులని కాపాడాడు. అయినా సప్త సముద్రాలతో ఉన్న ఈ భూమి అంతటినీ ధరించేవాడికి అదేం పెద్ద ఆశ్చర్యమైన పనేం కాదు కదా? ఈ పద్యంలో గోవులనే పదం ఉందా? మరో సారి చదివి చూడండి. గోగోపాలక వ్రాతమున్ అంటే గో – గోవులనీ, గోపాల వ్రాతమున్ – గోపాల సంఘాలనీ.

మ. హరివేణూద్గత మంజులస్వరనినాదాహూతలై గోప సుం
దరు లేతేర ధనాధిపానుచరగంధర్వుండు గొంపోవఁ ద
త్తరుణుల్ గుయ్యిడ శంఖచూడుని భుజాదర్పంబు మాయించి తాఁ
బరిరక్షించిన యట్టి కృష్ణుని నుతింపన్ శక్యమే యేరికిన్? [2-189]

వేణువు ఊదుతున్నప్పుడు వచ్చిన గోపికలని కుబేరుడి (ధనాధిప) అనుచరుడైన గంధర్వుడు (శంఖచూడుడు) ఎత్తుకుపోయాడు. వాళ్ల మొర విని శంఖచూడుడి భుజాదర్పం అణిచిన (మాయించి – ఓడించి) కృష్ణుణ్ణి కొనియాడం ఎవరి తరం?

చ. నరక మురప్రలంబ యవనద్విప ముష్టికమల్ల కంసశం
బర శిశుపాల పంచజన పౌండ్రక పల్వల దంతవక్త్ర వా
నర ఖర సాల్వ వత్స బక నాగ విదూరథ రుక్మి కేశి ద

ర్దుర వృష ధేనుక ప్రముఖ దుష్ట నిశాటులఁ ద్రుంచె వ్రేల్మిడిన్. [2-190]

ఈ పద్యంలో కృష్ణ బలరాములు కడతేర్చిన అసురలనందర్నీ చూపిస్తున్నాడు కవి. నరకాసుర, మురాసుర, ప్రలంబ, కాలయవన, చాణూర ముష్టిక, కంస, శంబర, శిశుపాల, పంచజన (వీణ్ణి చంపాక కడుపులోంచి తీసిన శంఖమే పాంచజన్యం), పౌండ్రక వాసుదేవుడు, పల్వల (ఇల్వలుడనే వాడి కొడుకు), దంతవక్త్ర, బలరాముణ్ణి చికాకు పరిచిన ఓ వానరుడు (ఈయన నరకాసురుడి స్నేహితుడు), ఖర (ధేనుకాసుర, గార్ధభం) సాల్వ, వత్స (మందలో చేరిన మాయా గోవు), బకాసుర, నాగ (అఘాసుర) రుక్మి, కేశి (గుర్రం రూపంలో), దుర్దుర, వృషభాసురుడు, ధేనుకాసురుడు వంటివారిని – నిశాటులని – చీకటిలో ఉండేవారిని అంటే రాక్షసత్వం కలిగినవారిని చిటికెలో సంహరించాడు. వీటి అర్థం ఏమిటంటే భగవంతుణ్ణి చూడగానే ఆ రాక్షసత్వం పోతుంది. అందుకే పూతన దగ్గిర్నుంచి చివరివరకూ ఒక్కొక్కరూ తమ రాక్షసత్వం పోగొట్టుకుని భగవంతుణ్ణి చేరుకుంటారని చెప్పేదే భాగవతం.

మ. బలభీమార్జున ముఖ్య చాపధర రూపవ్యాజతం గ్రూరులన్
ఖలులన్ దుష్టధరాతలేశ్వరుల సంగ్రామైక పారీణ దో
ర్బలకేళిం దునుమాడి సర్వధరణీభారంబు మాయించి సా
ధుల రక్షించిన యట్టి కృష్ణుని ననంతుం గొల్తు నెల్లప్పుడున్. [2-192]

బలరామ, భీమార్జునల వంటి విలుకాండ్రతో కూడి క్రూరులని, నీచులైనవారిని (ఖలులన్), చెడ్డ రాజులని (దుష్ట; ధరాతలేశ్వరులన్) మహా సంగ్రామంలో భుజబలంతో (దోర్బల కేళిం) తునుమాడి మొత్తం భూమండలంలో భారం అంతా తొలగించాడు; సాధులైన వారిని (మంచివారిని) రక్షించిన అనంతుడైన కృష్ణుణ్ణి నేనెప్పుడు సేవిస్తాను సుమా అని బ్రహ్మ చెప్తున్నాడు నారదుడితో.

ఈ పద్యాలన్నీ చదివితే ఇదేమిటి ఇవన్నీ ఒక వరసలో లేవు, కృష్ణావతారం గురించి ఇదేం కథ చెప్పడం అనిపించిందా? దీనికి సమాధానం సులభంగా చెప్పొచ్చు. మనం ఏదో అద్భుతమైన సంగతి చూడ్డానికి వెళ్ళాం అనుకోండి. వెనక్కి వచ్చాక మనం చూసినది వివరించి చెప్పమన్నారు ఎవరో. గుర్తున్నంతవరకూ చెప్పడంలో కొన్ని మర్చిపోవచ్చు; కొన్ని చెప్పడం చేతకాకపోవచ్చు. అందుకే కొన్ని విషయాలు చెప్పి మిగతా చోట – ఇటువంటి పనులు చేసిన భగవంతుడి పనులన్నీ పూర్తిగా ఎవరూ చెప్పలేరు సుమా అంటున్నాడన్నమాట.

వ. అట్టి లోకోత్కృష్టుండైన కృష్ణుని యవతారమహాత్త్యం బెఱింగించితి నింక వ్యాసావతారంబు వినుము. [2-193]

చ. ప్రతియుగమందు సంకుచితభావులు నల్పతరాయువుల్ సుదు
ర్గతికులునైన మర్త్యుల కగమ్యములున్ స్వకృతంబులున్ సుశా
శ్వతములునైన వేదతరుశాఖలు దా విభజించినట్టి స
న్నుతుఁడు పరాశరప్రియతనూజుఁడు నా హరి పుట్టె నర్మిలిన్. [2-194]

ప్రతీ యుగంలోనూ సంకుచిత స్వభావులూ దుర్గతి చెందేవాళ్ళు ఉంటారు. వీరికి భగవంతుడు స్వయంగా నిర్మించినట్టివీ (స్వకృతంబులన్), శాశ్వతం అయినట్టివీ అయిన వేదాలు అర్థం కావు. అందుకే భగవంతుడు పరాశరుని పుత్రుడైన వ్యాసుడిగా పుట్టి వేదాలని శాఖలుగా విభజించాడు. ఓ వింత విషయం గమనించారా? భాగవతం రాసేది వ్యాసుడే. అంటే వేదాలు మనకి ఇచ్చినదీ, అది అర్థంకావడానికి వాటిని విభజించినదీ భగవంతుడే. అందుకే ప్రతీచోటా పరీక్షిత్తుకి కథ చెప్పేటపుడు శుకమహర్షి చెప్తూనే ఉంటాడు – హరి మయము విశ్వమంతయు – అంటూ.

వ. మఱియు బుద్ధావతారంబు వినుము. [2-195]

మ. అతిలోలాత్ములు సూనృతేతరులు భేదాచార సంశీలురు
ద్ధత పాషాండమ తౌపధర్మ్యులు జగత్సంహారు లైనట్టి యా
దితి సంజాతు లధర్మవాసనల వర్తింపం దదాచార సం
హతి మాయించి హరించె దానవులఁ బద్మాక్షుండు బుద్ధాకృతిన్. [2-196]

ఈ పద్యం బుద్ధావతారం గురించి. చపల స్వభావులు (లోలాత్ములు), అబద్ధాలు ఆడేవారు, భేధాచార పరాయణులు, జనాలని ఏడిపించుకు తినే రాక్షస జాతులందర్నీ (దితి సంజాతులు) ధర్మమార్గంలోకి తీసుకురావడానికి భగవంతుడు (పద్మాక్షుడు, పద్మముల వంటి కళ్ళున్నవాడు) బుద్ధుడిలాగా జన్మించాడు.

వ. మఱియుం గల్క్యవతారంబు వినుము. [2-197]

మ. వనజాక్షస్తవశూన్యులై మఱి వషట్స్వాహాస్వధావాక్య శో
భనరాహిత్యులు, సూనృతేతరులునుం, బాషండులున్నైన వి
ప్రనికాయంబును శూద్రభూపులుఁ గలింబాటిల్లినం గల్కియై
జననంబంది యధర్మమున్నడఁచు సంస్థాపించు ధర్మం బిలన్. [2–198]

ఈ పద్యం రాబోయే కల్కి అవతారం గురించి. భగవంతుణ్ణి స్తుతించడానికి ఇష్టపడని జనం (వనజాక్ష – స్తవ – శూన్యులు) మంత్రాలతో శుభం పలకడం ఇష్టం లేనివారు, ఇటువంటి జనం పెచ్చుపెరిగే కొద్దీ అధర్మం పెరిగినప్పుడు కల్కి లాగా అవతరించి ధర్మం స్థాపించడానికి భగవంతుడు అవతరిస్తాడు. దీన్ని గురించి కొంచెం ఆలోచిస్తే నిజం తెలుస్తుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లోనే పక్కవాడికి మంచి జరిగితే సంతోషించలేకుండా ఉన్నాం. ప్రతీ విషయానికీ ఇది ఎందుకు, అదెలాగ, అసలు మంత్రాలు ఎందుకు ఉచ్చరించాలి. ప్రపంచం ఎలా పోతే నాకేం, బా చిన్నిబొజ్జకి శ్రీరామరక్ష అనేదే ప్రతీ ఒక్కరూ చూసుకునేది. 'భవంతుడే లేడు' అని ఒకరంటే, 'ఏదో ధర్మం అంటూ వాగుతారు కానీ మోసాలు చేసేవాళ్ళు బాగానే ఉన్నారు అంతా ఉత్తుది ఏ మోసం చేసినా ఏమీ అవదు' అనే జనం అందర్నీ ఎగదోస్తూనే ఉన్నారు. ఇదే రీతిలో కొనసాగి మొత్తానికి మనం ఉన్న భూమినే నాశనం చేసుకునే రోజు ఎంతో దూరంలో లేదు అని తెలుస్తూనే ఉంది కదా? అదే ఈ పద్యం చెప్పే కల్కి అవతారం రాబోయే రోజు.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS